ఆంధ్రభూమి మాసపత్రిక వారి కథల పోటీలో

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# మనసా! తొందరపడకే



"ఇంకేం చెప్పకు. నేనింకేం వినదల్చుకోలేదు. నీ కట్టుకథలు నమ్మేయడానికి నేనేం టీనేజ్ అమ్మాయిని కాదు. నువ్వు దులపరించినా దేబిరించడానికి నేనేమీ నీమీద ఆధారపడి బ్రతకట్లేదు. ఫైవ్ లాక్స్ పెర్ యానమ్ సంపాదిస్తున్నాను. మైండిట్"

"ప్లీజ్ సమీరా నామాట కాస్త విను"

"వినను వినను వినను. నీకు నామీద ప్రేమలేదు. నేనంటే కన్సర్న్ లేదు. నేనంటే నీకసలు లెక్కలేదు. నువ్వు నన్నో వేస్ట్‌ఫెలోగా చూస్తుంటే పడి ఉండాల్సిన ఖర్మ నాకు లేదు. యూనో నా కాళ్ల మీద నేను ధీమాగా నిలబడగలను. నీ చేయి నీ అండ నీ తోడు నాకేం అక్కర్లేదు"

"అనవసరంగా ఏదేదో వూహించుకుంటావేంటి. నేన్చెప్పేది కాస్త తల కెక్కించుకో..."

"ఎక్కించుకోను. ఇక నీకూ నాకూ ఏ సంబంధం లేదు. గుడ్‌బై. వెయిట్ ఫర్ డైవోర్స్ నోటీస్" కసిగా సెల్‌ఫోన్ బటన్ నొక్కి లైన్ కట్ చేసాను.

మళ్లీ మోగింది. మళ్ళీ వెంకట్.

మళ్ళీ లైన్ కట్ చేసాను. అయినా మళ్లీ మోగింది. మళ్లీ తనే.

ఒళ్లు మండిపోయింది. స్విచాఫ్ చేసి ఆటో పిలిచి ఎక్కాను.

నా మెదడు కుతకుత ఉడికిపోతోంది.

సందేహంలేదు. వెంకట్ నయవంచకుడు. పెళ్ళికి ముందు స్వీట్ నథింగ్స్ చెబుతూ నన్ను వూరిస్తూ కవ్విస్తూ నేనే లోకమన్నట్లు నా చుట్టూ తిరిగిన వెంకట్..... పెళ్ళయ్యాక మునుపటి శ్రద్ధ, ఆసక్తి, ప్రేమ లేకుండా ఏదో తప్పదన్నట్లు కలసి ఉంటూ ఆర్నెల్లకే ఆకర్షణపు రంగులు వెలిసి పోయేసరికి నేనంటే లక్ష్యం లేనట్లు ప్రవర్తిస్తూ తన నిజస్వరూపం బయట పెట్టుకున్నాడు.

గోముఖ వ్యాఘ్రం.

ఇక లాభంలేదు. ఇక ఇద్దరికీ పొసగదు. వెంకట్ వద్దు, అతడితో అనుబంధం వద్దు. అతడు అద్దెకు తీసుకున్న ఇల్లు వద్దు. అతడి తాళి వద్దు. అతడితో సంబంధమున్నదేదీ వద్దు గాక వద్దు.

'అవునంతే' అనుకోబోతూ ఉలిక్కిపడ్డాను.

మరి నా గర్భంలోని అతడి బిడ్డ?

క్షణకాలం ఊగిసలాడాను.

అదీ వద్దు. నవమాసాలు మోసి చావుతో కొట్లాడి బిడ్డని కంటే 'నా బిడ్డ' అంటూ వస్తాడు. ఎగరేసుకుపోవాలని చూస్తాడు. పైగా బిడ్డని చూసిన ప్రతి క్షణం అతడు గుర్తుకువస్తాడు. అది భరించడం అసాధ్యం.

సో... అతడి నీడ కూడా పడకూడదు. అతడి తాలూకు జ్ఞాపకాల్ని యాసిడ్ పోసి తగలెట్టేయాలి. అంటే బిడ్డని కడుపులోనే...!

డాక్టర్ గీతకి ఫోన్ చేసాను. ప్రెగ్నెంట్ అని కన్ఫర్మ్ చేసింది ఆవిడే. బలానికంటూ మందులు రాసిచ్చిందీ తనే.

అబార్షన్ చెయ్యడానికి అపాయింట్‌మెంట్ తీసుకుని తేలిగ్గా నిట్టూర్చాను.

తాళం తీసి ఇంట్లో అడుగుపెట్టాను.

నిన్నటిదాకా స్వీట్‌హోం అని దీన్ని చూసే కదూ పొంగిపోయాను. కానీ ఇప్పుడు దెయ్యపు గుహలా కన్పిస్తోంది చూడు.

వెంకట్ దెయ్యమే. మగవేషం ధరించిన దెయ్యం. సందేహం లేదు. ప్రేమించలేని వాళ్లంతా దెయ్యాలే.

గీజర్ ఆన్ చేయబోతూ ఆగాను. ఒళ్లంతా చీరి కారం పూసినట్లు మండి పోతుంటే వేడి నీళ్లెందుకు?

వణుకుతూనే చన్నీటి స్నానం చేసొచ్చాను.

రేపు నర్సింగ్‌హోం కెళ్లొచ్చాక నా సామాన్లు తీసుకుని వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌కి షిఫ్టవ్వాలి. ఈ ఇంట్లో వెంకట్‌తో అరనిముషం కూడా ఉండలేదు గాక ఉండలేదు.

అశాంతిగా కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ తిరుగుతోంటే ఫోటో ఆల్బం కన్పించింది.

రిలీఫ్‌గా ఉంటుందని దాన్ని చేతుల్లోకి తీసుకుని పేజీలు తిప్పాను.

అమ్మమ్మ.

ముడతలు పడిన శరీరం, ఆప్యాయంగా చూస్తున్న కళ్లు. పెద్ద బొట్టు. నిండుగా పెద్ద ముత్తైదువలా ఉంది.

తాతతో దగ్గర దగ్గర అరవైఏళ్ళు కాపురం చేసింది. అమాయకురాలు కాకపోతే అలా ఎలా చెయ్యగల్గుతుంది. తనకి ఓ చదువా పాడా?!

"చిన్నీ"

ఉలిక్కిపడి చూసాను, అపనమ్మకంగా చూసాను. ఎదురుగా అమ్మమ్మ.

"నేను చిన్నినేంటి. పెద్దదాన్నైతేనూ. నాకిప్పుడు పాతికేళ్లు తెలుసా?"

"నా కళ్లకి మాత్రం ఎనిమిదేళ్ల చిన్నివేనే"

"సరే అలాగే అనుకో. ఇప్పుడేమంటావు చెప్పు?" కించిత్తు విసుగు ధ్వనించింది నా స్వరంలో.

"ఆ దూకుడేవిటే పిల్లా. నాలుగు డబ్బులు సంపాదిస్తున్నావని మిడిసిపడకు. ఏమీ లేనమ్మ ఎగిరెగిరి పడుతుంది. అన్నీ వున్నమ్మ అణగి వుంటుందని వూరికే అన్లేదు. ఆడదానికి భూదేవంత ఓర్పు ఉండాలి. కాపురాన్ని చక్కదిద్దుకోగల నేర్పుండాలి. అప్పుడే సంసారం స్వర్గమవుతుంది"

"ట్రాష్! నీవన్నీ బూజుపట్టిన భావాలు. మీది, ఆడది మగాడి పాదదాసిగా

పడుండాలని తెలివైన మగాళ్లు నూరిపోసిన పైత్యం. మీకు స్వంత సంపాదన, స్వతంత్ర వ్యక్తిత్వం లేవు కనుక గానుగెద్దుల్లా, బానిసల్లా బ్రతికారు”

“నోర్ముయ్యవే. షోగ్గా బట్టలు కట్టుకుని తిప్పుకుంటూ తిరిగినంత మాత్రాన నువ్వేదో ఆకాశంలోంచి ఎకాఎకి దిగి వచ్చినట్లు మాట్లాడతావేంటి? కార్యేషు దాసి కరణేషు మంత్రి అని పెద్దలన్న సంగతి మర్చిపోకు. ఆడది సందర్భాన్నిబట్టి రకరకాల పాత్రలు పోషించాలి. భర్తని సుఖపెట్టాలి. పిల్లల్ని పెంచాలి. ఇంటిని చూసుకోవాలి. అంతేగానీ తెయ్‌మంటూ పెత్తనాలు చేయడానికి ఊరిమీద పడితే నీలాగే తయారవుతారు!”

“ఇప్పుడు నాకేమయింది హాయిగా ఉన్నాను. హ్యాపీగా బ్రతుకుతున్నాను. కోరిందల్లా ఇష్టానుసారం కొనుక్కోగలుగుతున్నాను”

“మాబాగా ఉన్నావులే. కుక్కమూతి పిందె బుద్ధులూ నువ్వూనూ. కట్టుకున్న మొగుడితో తెయ్‌మంటూ విడాకులిచ్చేస్తానని చెబుతావా? హవ్వ...... ఇలాంటి చోద్యం నేనెక్కడా విన్లేదమ్మా”

“మూతి మూడు వంకర్లు తిప్పుతూ నన్నాడిపోసుకోకబోతే వెంకట్ ఏం చేసాడో తెలుసుకోవచ్చుగా. అది తెలిస్తే నువ్వే అతగాడ్ని చెప్పు తీసుకుని కొడతావు”

“ఏం చేశాడమ్మా కొట్టాడా తిట్టాడా తిండి పెట్టక మాడ్చాడా, ఇంట్లోంచి పొమ్మన్నాడా?”

“అంతకంటే ఎక్కువే చేసాడు. వింటావా? వినైతే. వెంకట్ నేనూ బైక్ మీద వెళ్తున్నాం. ఎవడో ఆటోవాడు తాగి వుంటాడు వెధవ.....మమ్మల్ని గుద్దేశాడు. నాకెక్కువ దెబ్బలు తగిలాయి. మోకాళ్లూ, మోచిప్పలూ కొట్టుకుపోయాయి. కాలు పట్టేసింది. నడవలేక పోయాను. జనం వింతగా చూస్తున్నారు. ఎంతో ఇన్సల్టింగా వుంది. అప్పుడు వెంకట్ ఏం చేసాడో తెలుసా? ఆటోవాడ్ని ఏమీ అనలేదు. నన్ను రోడ్డుపక్కకి నడిపించుకుంటూ వెళ్లాడు. షాపులోంచి నీళ్లు తెచ్చి దెబ్బలు కడిగాడు. ఆటోని పిలిచి ఎక్కించి ఆస్పత్రికి వెళ్లమన్నాడు. నా కన్నీరు పట్టించుకోకుండా తనకి ఆఫీసులో అర్జంటు పనుందని చెప్పి వెళ్లిపోయాడు తెలుసా?”

“ఓస్ ఇంతోటి దానికేనా అంత రాద్ధాంతం చేస్తున్నావు! నీ నోట్లో నాలిక వుంది. ఆ నాలిక మీద సరస్వతి ఉంది. ఆ మాత్రం సర్దుకోలేవూ? ఆడలేక మద్దెల ఓటు అన్నట్టుంది. నీ వరస. అయ్యో అయ్యో పిదపకాలం పిదప బుద్ధులూ కాకపోతే మొగుడు నీకు సేవ చేయాలని వీధెక్కి అరుస్తావేంటే నీ సిగ్గు బొగ్గులవ్వ!”

నా మొహం కందగడ్డ అయింది. ఆవిడ మాటలు మరి విన్లేక పేజీ తిప్పేసాను. అయినా అమ్మమ్మ మాటలు నా మనసును కలిచి వేయడం మాన్లేదు.

మా పెళ్లి ఫోటోలో కన్యాదానం చేస్తూ ఆనందాన్నీ విచారాన్నీ ఏకకాలంలో అనుభవిస్తూ అమ్మ....

పాపం అమ్మ...!

ప్చ్.... మా పెళ్లయిన మూడు నెలలకే లివర్ క్యాన్సర్‌తో అందని లోకాలకు వెళ్లిపోయింది.

"నేనెక్కడికీ వెళ్లలేదే సమీరా. నీతోనే ఉన్నాను. నేన్నీ అమ్మనే, కంటిరెప్పనే"

"వెంకట్ ఎంత దారుణంగా ప్రవర్తించాడో చూసావా మమ్మీ? ఒక ఇష్టం లేదు, ఒక కన్సర్న్ లేదు. నువ్వేమైతే నాకేం అన్నట్లు నన్ను నా మానాన వదిలేసి ఆఫీసుకు చక్కాబోయాడు. తనకే ఉంది ఆఫీసు. నాకు లేదు. అలాంటి వాడ్ని సాక్షాత్తూ లక్ష్మీనారాయణ స్వరూపుడంటూ మీరు కాళ్లు కడిగి మరీ కన్యాదానం చేసారు. బోలెడు కట్నమూ ఇచ్చారు"

"అదంతా నీ పేరనే పెట్టాం కదే"

"అది మనసులో పెట్టుకున్నాడో ఏమో నేనంటే ఒక ఇది లేదు, ఒక ప్రేమలేదు. ఒక తపన లేదు, ఒక తాపత్రయం లేదు"

"మీరిద్దరూ ప్రేమించుకున్నారని నువ్వు గట్టిగా ఒత్తిడి తెచ్చినందునే కదే మీ డాడీ మీ పెళ్లికి ఒప్పుకున్నారు. అతడితో పెళ్లికి ఒప్పుకోకపోతే అఘాయిత్యం చేసుకుంటానని బెదిరించావు కదే"

"అప్పుడేదో తెలిసీ తెలియక వాగితే ఇప్పుడదంతా తవ్వి వెక్కిరించాలా?"

"నేనేమీ వెక్కిరించట్లేదే. జరిగింది గుర్తు చేస్తున్నానంతే. ఇది చెప్పు. నువ్వు ఆసుపత్రికి వెళ్లాక అల్లుడు ఫోన్ చేసి నీకెలా ఉందన్నది ఆరా తీసాడా లేదా?"

"తను రాలేదు. ఊరికే ఫోన్లు చేసాడు. అర్ధరూపాయే కదా ఖర్చు. నాకు ఒళ్లు మండి కాల్స్ రిసీవ్ చేసుకోలేదు"

"పాపం పశ్చాత్తాపపడ్డాడేమోనే"

"అదేం కాదు. అదే నిజమైతే నన్ను వెదుక్కుంటు రాడూ?"

"అయిందేదో అయింది. గోరంతని కొండంత చేయకు. జరిగిన దాంట్లో ఇద్దరి తప్పూ ఉంది. దాన్ని మర్చిపోండి. ఏమీ జరగనట్టు కలసిపొండి. మీకెంతో భవిష్యత్తు ఉంది సమీరా"

"అతడితో కలసిన భవిష్యత్తు నాకక్కర్లేదు. విడాకులు తీసుకోవాలని డిసైడ్ అయిపోయాను"

"ఈ మాత్రానికే. గోటితో పోయేదానికి గొడ్డలితో నరుకుతానంటావేమిటే పిచ్చి మొద్దూ"

"నువ్వేమైనా అనుకో. ఒకసారి తేడా వస్తే అంతే. పగిలిన అద్దం అతకదు. ఎడ్జస్టవడం, రాజీపడి బ్రతకడం నాకు తెలీదు. ఒకరికి అణిగి ఉండాల్సిన ఖర్మ నాకు లేదు. నా వ్యక్తిత్వం చంపుకుని అతడితో కలిసుండాల్సిన అగత్యం నాకు లేదు"

"అయ్యో....అయ్యో అవేం మాటలే. చదువుకున్నదానివి కూడానూ. లోకం కళ్లతో

చూసి లోకజ్ఞానంతో ఆలోచించవే. పెళ్లయి పట్టుమని ఆరు నెలలు కాలేదు. పైగా వట్టి మనిషివి కూడా కాదు. ఈసారికి అల్లుడ్ని క్షమించేసి సర్దుకుపోతే రేపు బిడ్డ పుట్టాక మీ బంధం మరింత గట్టి పడుతుంది"

"అందుకే ఆ బంధం వద్దనుకుంటున్నాను. అబార్షన్ చేయించుకుంటున్నాను. నువ్వేమనుకున్నాసరే మై డెసిషన్ ఈజ్ ఫైనల్"

"నా మాట వినవే"

"వినను. మీది కిచెన్‌లో మ్రగ్గిన కాలం. మాది డ్రాయింగ్ రూంలో కాలు మీద కాలు వేసుకుని టీవీ చూసే కాలం. మీ భావాలకూ నాకూ పొసగదు. బై....."

విసురుగా పేజీ తిప్పేసాను.

అమ్మ నిట్టూర్చినట్లు అనుభూతి కలిగింది. ఆమె మాటలు మాత్రం నా బుర్రలో సుళ్ళు తిరుగుతున్నాయి.

అమ్మ ముఖాన్ని మళ్లీ మళ్లీ గుర్తు చేసుకున్నాను. దు:ఖం పొంగి వచ్చింది. ఏడ్చేశాను.

కాస్సేపటికి తేరుకుని గబగబా పేజీలు తిప్పేస్తూ ఆల్బం మూసేయబోతుంటే అత్తగారి మాట విన్పించింది.

"నన్ను చూసీ చూడనట్లు వెళ్లిపోతున్నావా సమీరా? కోడలిగా కాదు, కూతురిగా ఉంటానని చెప్పి ఇప్పుడిలా చెయ్యడం ఏమైనా బాగుందా?"

"ఆహా అది కాదు ఆంటీ. మనస్సు బాగాలేదు. అందుకని........"

"బాగోలేనప్పుడు నాతో నాలుగు మాటలు పంచుకుంటే బరువు దిగిపోతుంది కదుటే. నేనేమీ పరాయిదాన్నికాదు కదే. అత్తింటి అమ్మను. అత్తమ్మను..."

"నాకు తెలుసుసాంటీ. మీరూ అంకులూ ఎంతో మంచివాళ్లు. కానీ వెంకట్ చాలా మారిపోయాడు. సెల్ఫిష్ అయిపోయాడు. ఇదివరకట్లా లేనేలేడు"

"మీరిద్దరూ ప్రేమించుకున్నాం, ఒకర్నొకరు బాగా అర్థం చేసుకున్నాం అన్నారు కదమ్మా"

"అలా అనుకుని భ్రమ పడ్డామని ఇప్పుడనిపిస్తోంది ఆంటీ. పెళ్లి కాకముందు ఎక్కడికంటే అక్కడికి ఎప్పుడంటే అప్పుడు వచ్చేవాడు. నాతో కలసి స్పెండ్ చేయడంకోసం తహతహలాడేవాడు. నాకెంత ఇంపార్టెన్స్ ఇచ్చేవాడో మాటల్లో చెప్పలేను. నాకిష్టమైనవన్నీ రుచి చూపించేవాడు. నా కంట్లో నలుసు పడితే విలవిల్లాడి పోయేవాడు. నాతోడితే లోకమన్నట్లు నా చుట్టూ ఉప గ్రహంలా తిరిగేవాడు. అలాంటిది నాకు దెబ్బలు తగిలినా, సరిగ్గా నడవలేకపోతున్నా పట్టించుకోకుండా నా మానాన నన్నొదిలేసి వెళ్లిపోయాడు. ప్రెగ్నెంట్‌నన్న జాలి కూడా లేకుండా ఇన్‌హ్యూమన్‌గా బిహేవ్ చేసాడు. నేను ఆసుపత్రిలో చచ్చిపోయినా ఇంతే కదా?" బావురుమన్నాను.

"ఊరుకో పిచ్చిపిల్లా. అతిగా ఊహించుకుని బాధపడతావెందుకు చెప్పు. మీరిప్పుడు

ఫ్రీ బర్డ్స్ కాదు. పెళ్లయిన వాళ్లు. పెళ్లి ఒక బాధ్యత. ఉద్యోగం ఇంకో బాధ్యత. వాటి వాటి ప్రాముఖ్యతల్నిబట్టి కొన్ని విషయాలు అల్పంగా అప్రాధాన్యాలుగా మారిపోతుంటాయి. సమయ సందర్భాలని బట్టి అర్థం చేసుకోవాలి. అవగాహనకు రావాలిగాని ఇలా తొందరపడకూడదు. ఆవేశంతో పెద్ద పెద్ద నిర్ణయాలు తీసుకోకూడదు"

"ఎంతైనా మీరు ఆంటీగానీ అమ్మ కాదు కదా. మీ అబ్బాయినే వెనకేసు కొస్తారు. మీకు మీ వంశాంకురం మీద మక్కువ ఉంటుందిగానీ నామీద ఉంటుందను కోవడం ఫూలిష్‌నెస్"

"తిక్కతిక్కగా మాట్లాడకు. మీతో వచ్చిన చిక్కే ఇది. మీకు తోచదు. చెబితే వినరు..."

"ఏమంటారైతే?"

"మీరిద్దరూ చిన్నవాళ్లు. నిన్నగాక మొన్న కాపురం పెట్టారు. మీకన్నీ వివరించి చెప్పడానికి దగ్గర పెద్దవాళ్లమెవరం లేకపోయాం. దాంతో మీరు మీ స్వేచ్ఛని అపార్థం చేసుకోవడానికి, రెచ్చిపోవడానికి వినియోగించుకుంటున్నారు. నా మాట విని మీ చదువుల్నీ, హొదాల్నీ, సంపాదనల్నీ ప్రక్కనపెట్టి మీ ఇద్దరూ స్నేహితుల్లా మనసు విప్పి మాట్లాడుకోండి. మబ్బులన్నీ విడిపోతాయి. మనస్సులు మల్లెపూవులవుతాయి. నువ్వు అనవసరంగా ఆవేశపడుతున్నావు గానీ ఇదంతా టీ కప్పులో తుపాను"

ఆల్బం మూసేసి ఆలోచనలో పడ్డాను.

కొంపతీసి ఆంటీ చెప్పింది నిజమేనా ఏమిటి?

తమ మధ్య ఉన్నది ఇగో ప్రోబ్లమా?

అంటే..వట్టి అపోహ మాత్రమేనా?

గోరంతని భూతద్దంలో చూసి కొండంతగా అనుకుంటున్నానా?

అవునూ, వెంకట్‌కి నా మీద ప్రేమ లేదనుకుంటున్నాను. సరే మరి నా సంగతేమిటి? నాకతడిమీద ప్రేమ ఉందా లేదా?

ప్రేమంటే ఒక అభిమానం.

ఒక ఆర్ద్రత. ఒక అనురాగం.

ఒక క్షమ. ఒక నిస్వార్థ సమర్పణ.

మరెందుకు నేనిలా ప్రవర్తిస్తున్నాను?

తల విదిలించాను.

తిన్నగా కూర్చోలేక అటూ ఇటూ పచార్లు చేసాను. ఆంటీ, అమ్మ, అమ్మమ్మలు తన ఊహల్లోకొచ్చి అలా మాట్లాడారంటే హితవు చెప్పేరంటే కౌన్సిలింగ్ చేశారంటే........అదంతా నా లోలోపల నలుగుతున్న సంఘర్షణ అన్న మాటే కదా? అదే వారి ముఖత: వెలువడినట్టేకదా?

నా మెదడులో భావ సంఘర్షణ. అహాల పోరు. ఎగిసిపడుతున్న ఎక్కువ తక్కువ

భావనల కెరటాలు!

శస్త్ర చికిత్స బల్లమీద స్త్రీ పురుష సంబంధమూ వివాహబంధమూ!

ఎట్టకేలకు అంతా సద్దుమణిగింది. గుండెల్లో శాంతి వాతావరణం అలుము కోసాగింది.

గాఢంగా నిట్టూర్చానో లేదో డోర్ బెల్ మ్రోగింది.

గుబుక్కునెళ్లి తలుపు తీసాను.

వెంకట్.

"సారీ డార్లింగ్" అంటూ తెల్ల గులాబీని నాటకీయ భంగిమతో అందించాడు.

నవ్వేసాను.

"ఐ లవ్ ఇట్" నాకెంతో ఇష్టమైన తెల్ల గులాబీని అపురూపంగా చూస్తూ వాసన చూస్తూ అన్నాను.

"సారీ యార్. పొద్దుట ఫారన్ డెలిగేషన్తో మీటింగ్. నేన్లేకపోతే ప్రాజెక్టు చేజారిపోయేది. అప్పుడు టీమ్‌లీడ్‌ని అయ్యేవాడ్నే కాదు"

"ఈజిట్? కంగ్రాట్స్.....యూ డిజర్వ్‌ట్. నీ అంకితభావం అలాంటిది."

"థాంక్యూ. నేనే స్వయంగా నిన్ను ఆసుపత్రికి తీసుకెళ్లి ఉండాల్సింది. నీకన్నా డ్యూటీ ఇంపార్టెంట్ కాదుకదా. కానప్పుడు ఆ థాట్ రాలేదు. చిన్న దెబ్బలే కదా అనుకున్నాను"

"ఓకే లీవిట్" కలుషితమైన నా ఆలోచనకి సిగ్గుపడుతూ అన్నాను.

"బట్ డోంట్ లీవ్ మీ"

"వదల్నే వదలను. రేపు నేను నా బిడ్డకి మంచిగా, మనిషిగా బతకమని, అర్థం చేసుకుని సదవగాహనతో జీవించమని బోధించే అదృష్టం కలగజేస్తున్నావుకదా!"

"సమ్మీ! నాకు ఒక్క ముక్కా అర్థం కాలేదు"

"ఇంతదాకా మీ అమ్మ మా అమ్మ మా అమ్మమ్మ నా బుర్ర తిన్నార్లే. అలాగే అవసరపడితే నా కూతురి బుర్రా తింటానంటున్నాను నా పిచ్చి హబ్బీ" వాటేసుకుంటూ అన్నాను.

వెంకట్ నా చుట్టూ చేతులేసి పొదవి పట్టుకున్నాడు. మైమరచిపోయాను.

కరిగిపోయాను. అతల్లో కలసిపోయాను.

ఇప్పుడు మేం ఇద్దరం కాదు ఒక్కరమే!

**(ఆంధ్రభూమి మాసపత్రిక, ఫిబ్రవరి 2012)**

**(కన్నడంలోకి అనువదింపబడినది)**